ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది : 11.05.2024 సమయం : 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. లోక్ సభ ఎన్నికల మూడో విడతలో 65.68 శాతం ఓటింగ్ నమోదైందని భారతీయ ఎన్నికల సంఘం తెలిపింది.
2. 9 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 96 లోక్ సభ స్థానాలకు గాను జరిగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం 6 గంటలకు ముగిసింది.
3. ఒకే దేశం ఒకే నాయకుడు అనే అలోచనను బీజేపీ ప్రచారం చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.
4. దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సమాఖ్య ( సార్క్ ) సెక్రటరీ జనరల్ మహ్మద్ గోలం సర్వర్ భారతదేశానికి తన మొదటి అధికారిక పర్యటన నిమిత్తం భారత్ చేరుకున్నారు.

--------------------------

**EC-3rd PHASE VOTER TURNOUT**

లోక్‌సభ ఎన్నికల మూడో విడతలో మొత్తం 65.68 శాతం ఓటింగ్ నమోదైంది. వీరిలో దాదాపు 66.89 శాతం పురుషులు, 64.41 శాతం స్త్రీలు మరియు 25.2 శాతం మంది థర్డ్ పర్సన్స్ జెండర్ ఉన్నారు. ఎన్నికల సంఘం నివేదిక ప్రకారం, అస్సాంలో అత్యధికంగా మహిళా ఓటర్లు 85.34 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 83.01 శాతం ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 56.01 శాతం మహిళా ఓటర్లు నమోదవ్వగా, గుజరాత్‌లో 56.56 శాతం పోలింగ్ నమోదు అయింది. థర్డ్ జెండర్ ఓటర్ల విషయానికొస్తే, గోవాలో అత్యధికంగా 75 శాతం ఓటింగ్ నమోదైంది.ఈ దశలో పది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 93 లోకసభ స్థానాలకు ఎన్నికలు

జరుగగా.  గుజరాత్‌లో 25, కర్ణాటకలో 14, మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, మధ్యప్రదేశ్‌లో 9, ఛత్తీస్‌గఢ్‌లో 7, బీహార్‌లో 5, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో చెరో రెండు స్థానాలకు పోలింగ్ జరిగింది.

**NSD**

--------------------------------------

**KHARGE-ECI**

ఇదిలా ఉండగా ప్రతి దశ ఎన్నికల తర్వాత మొత్తం ఓటింగ్ శాతాన్ని ప్రకటించేందుకు ఎన్నికల సంఘం అనుసరిస్తున్న పద్ధతిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఖర్గే ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖలో, పబ్లిక్ డొమైన్‌లో పోలైన ఓట్ల సంఖ్యను పూర్తిగా బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సూచించారు. ఎన్నికలపై తీవ్ర ఆసక్తి ఉన్న చాలా మంది ఓటర్లు సంపూర్ణంగా పోలైన ఓట్లను కూడా తెలుసుకోవాలనుకుంటున్నారని ఖర్గే పేర్కొన్నారు.

**NSD**

--------------------------------------

**ELECTION 4TH PHASE**

**9 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 96 లోక్ సభ స్థానాలకు గాను జదరిగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఈ దశలోనే ఆంధ్రప్రదేశ్ లో ఒకే విడతలో ఒరిస్సాలో మొదటి విడతలో శాసన సభ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. నాలుగో విడత పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది.** కాగా లోక్ సభ ఎన్నికలకు తెలంగాణలో ప్రచారం ఈ సాయంత్రంతో ముగిసింది. నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రచారం సాయంత్రం నాలుగు గంటలకు ముగియగా ఇతర ప్రాంతాల్లో ఆరు గంటలకు ప్రచారాన్ని ముగించారు. ఈ నెల 13వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ

పోలింగ్ బృందాలు రేపు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్తాయని చెప్పారు. ఉదయం 5:30కు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుంది. వామపక్ష తీవ్రవాదం ఉన్న 13 అసెంబ్లీ నియోజకవర్గాలు మినహా ఇతర ప్రదేశాల్లో పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరుగుతుంది.

**SDP/MSL**

------------------------------

**ARVIND-BJP**

ఒకే దేశం ఒకే నాయకుడు అనే ఆలోచనను బీజేపీ ప్రచారం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఈరోజు ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీని మట్టికరిపించాలని బీజేపీ భావిస్తోందని ఆరోపించారు. ఆప్ ఒక పార్టీ కాదని, ఒక సిద్ధాంతమని ఆయన అన్నారు. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో, కేజ్రీవాల్ కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని I.N.D.I.A కూటమి ఏర్పాటు చేస్తుందని, AAP ప్రభుత్వంలో భాగం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ కళంకిత, అవినీతి నేతలను కూడా పార్టీలో చేర్చుకుంటోందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను జైలుకు పంపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**NSD**

--------------------------------

**LADAKH-SVEEP AWARENESS PROGRAM**

లడఖ్‌లో, పదుమ్ జన్స్కార్లో పౌర భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య స్ఫూర్తిపై ప్రేరణ కలిగించే ప్రదర్శన జరిగింది. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (SVEEP) అవగాహన కార్యక్రమం అద్భుతమైన విజయాన్ని సాధించింది. మే 20, 2024న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓటర్లలో అవగాహన, భాగస్వామ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమం వివిధ భాగస్వాములను ఒకచోట చేర్చగా, ప్రభుత్వ అధికారులు, బూత్ స్థాయి అధికారులు (BLOలు), విద్యార్థులు, ఓటర్లు ఎన్నికల ప్రక్రియ దాని

ప్రాముఖ్యతపై లోతైన అవగాహనను పెంపొందించడానికి రూపొందించిన ఆకర్షణీయమైన కార్యకలాపాల శ్రేణిలో పాలుపంచుకున్నారు.

**NSD**

---------------------------

**DELHI HC-DU SALARY**

ఢిల్లీలోని పన్నెండు యూనివర్సిటీ కాలేజీలకు పూర్తి స్థాయిలో నిధులను అందజేసి, సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు వారంలోగా నిధులు విడుదలయ్యేలా చూడాలని ఢిల్లీ హైకోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయపరమైన ఆదేశాలను పాటించకుంటే ఢిల్లీ ప్రభుత్వ సీనియర్ అధికారులకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. గత నెలలో జారీ చేసిన హైకోర్టు ఆదేశాలను కావాలనే ఉద్దేశపూర్వకంగా పాటించడం లేదని ఆరోపిస్తూ, ఉన్నత విద్యా శాఖ మంత్రి అతిషి, ఆ శాఖ కార్యదర్శి ఆర్ అలీస్ వాజ్, డైరెక్టర్ భూపేష్ చౌదరిలపై కోర్టు ధిక్కార చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ తుషార్ రావు గేదెల నిన్న విచారణ చేపట్టారు.

**NSD**

-------------------------

**SINGAPORE PM-IIT**

తమ దేశ ప్రగతికి విదేశీ ప్రతిభావంతుల సహకారం ఎంతో ఉందని సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ లూంగ్ కొనియాడారు. సింగపూర్ అభివృద్ధిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) నుండి వచ్చిన ప్రతిభావంతులైన పట్టభద్రుల పోషించిన పాత్ర కీలకమని ఆయన అన్నారు. ఈ నెల 15న అధ్యక్ష పదవి నుంచి వైదొలగడానికి ముందు ప్రధానమంత్రి లీ సింగపూర్ న్యూస్ ఛానెల్‌తో ఒక విస్తృత ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రధాన మంత్రి లీ, సింగపూర్ మానవ వనరుల అవసరాలను తీర్చడానికి విదేశీ ప్రతిభను తీసుకురావడం కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పుతూ.... IIT-IIM పూర్వ విద్యార్థుల నాణ్యతను కొనియాడారు.

**NSD**

-----------------------------

**SAARC SEC GEN-INDIA VISIT**

దక్షిణ ఆసియా దేశాల ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) సెక్రటరీ జనరల్ ముహమ్మద్ గోలమ్ సర్వర్ భారతదేశానికి తన మొదటి అధికారిక పర్యటన నిమిత్తం న్యూఢిల్లీ చేరుకున్నారు. దక్షిణాసియాలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఆయన పర్యటన ఒక అవకాశం అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమ వేదికగా చేసిన పోస్ట్ లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్వర్ ఐదు రోజుల పాటు మన దేశంలో పర్యటించనున్నారు. ఈ సమయంలో ఆయన పలు వరుస సమావేశాల్లో పాల్గొంటారు.

**NSD**

---------------------------------------

**JAISHANKAR INDIA-EU**

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ భారత్-ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) చర్చల ఆవశ్యకత, వాణిజ్య సాంకేతిక పరిజ్ఞాన మండలి (టిటిసి)లో సహకారంపై సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేశారు, రెండు సంస్థల మధ్య పెరుగుతున్న పరస్పర ఆర్థిక సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. న్యూఢిల్లీలో జరిగిన EU జాతీయ దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగిస్తూ, గత సంవత్సరం ప్రారంభించిన భారత్ తూర్పు ఐరోపా దేశాల ఆర్థిక కారిడార్ (IMEEC) పట్ల మనదేశ సానుకూల వైఖరి నొక్కిచెప్పారు. ఈ కారిడార్ పురోగతి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశంలోని EU రాయబారి హెర్వ్ డెల్ఫిన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ భారతదేశ అతిపెద్ద ఆర్థిక భాగస్వామి అని అన్నారు.

**NSD**

----------------------------------

**AFGHANISTAN-FLASH FLOODS**

ఆఫ్ఘనిస్తాన్‌లో, భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య ఒకే ప్రావిన్స్‌లో 200 దాటిందని ఐక్యరాజ్యసమితి ఈ రోజు తెలిపింది. ఉత్తర ప్రావిన్స్ బాగ్లాన్‌లో నిన్న ఒక్కరోజే 62 మందికి పైగా మరణించారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ తెలిపింది, భారీ వర్షాల కారణంగా బాగ్లాన్‌లో వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి లేదా దెబ్బతిన్నాయి. ఉత్తర ప్రావిన్స్‌లోని విపత్తు నిర్వహణ అధికారి మాట్లాడుతూ, ప్రావిన్స్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షం రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్న కారణంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. జాతీయ సైన్యం, పోలీసులు, భద్రతా దళాల సహాయంతో అత్యవసర సిబ్బంది బురదలో శిధిలాల కింద బాధితుల కోసం వెతుకుతున్నారు. ఈశాన్య బదక్షన్ ప్రావిన్స్, సెంట్రల్ ఘోర్ ప్రావిన్స్‌లో కూడా వర్షాలు భారీ నష్టాన్ని కలిగించాయి. తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ దేశవ్యాప్తంగా వరదల వల్ల ప్రభావితమైన వారికి అధికారులు సహాయం అందిస్తారని సామాజిక మాధ్యమ వేదికగా తెలిపారు..

**NSD**

------------------------------

**BRAZIL FLASH FLOODS**

కాగా నిన్న బ్రెజిల్‌లో, భారీ వర్షాలు కురిసిన తర్వాత సంబంవించిన ఆకస్మిక వరదల కారణంగా 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 756 మంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, 141 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. మృతుల వెతుకులాట, సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. రియో గ్రాండే దో సుల్ రాష్ట్రంలో 20,000 మంది సైనిక సిబ్బందిని మోహరించారు. వరద కారణంగా విద్యుత్ నీటి శుద్ధి ప్లాంట్లు కూడా దెబ్బతిన్నాయి. చాలా మంది నిర్వాసితులు తాగునీరు, విద్యుత్తు లేక ఇబ్బందులు గురి అయ్యారు.

**NSD**